


శుక్రవారం | 7 | ఆగస్టు | 2026 ◆ పేజీలు : 7


# బెటాలియన్‌లో ఘనంగా జయశంకర్ సార్ జయంతి వేడుకలు



**సత్తుపల్లి ఆగస్టు 06 (ప్రజాజ్యోతి)** మండల పరిధిలోని గంగారంలో గల 15వ పోలీసు బెటాలియన్, తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రముఖ విద్యావేత్త కీర్తిశేషులు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ బి. వేణుగోపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, ప్రొఫెసర్ జయశంకర్

మిగతా 2 లో...




# పేదలకు 'సన్న' భరోసా!

- దేశంలోనే ఉచిత సన్న బియ్యం అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ - మంత్రి పొంగులేటి
- ఈశ్వరమాదారంలో మూడు నెలల ఉచిత రేషన్ బియ్యం పంపిణీని ప్రారంభించిన శ్రీనివాస రెడ్డి

**పాలేరు ఆర్.సీ ఆగస్టు 06 ప్రజా జ్యోతి** రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పేదల ఆహార భద్రతకు పెద్దపీట వేస్తూ నాణ్యమైన సన్న బియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టామని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ప్రతి లబ్ధిదారుడికి ప్రతినెలా 6 కిలోల చొప్పున ఉచితంగా సన్న బియ్యం అందిస్తున్నామని చెప్పారు. గురువారం ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం ఈశ్వర మాదారం గ్రామంలోని చౌక ధరల దుకాణంలో జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్.తో కలిసి లబ్ధిదారులకు మూడు నెలల ఉచిత సన్న బియ్యాన్ని మంత్రి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదలకు భరోసా కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ఉచితంగా నాణ్యమైన సన్నబియ్యాన్ని అందిస్తున్న ఏకైక రాష్ట్రం దేశంలో తెలంగాణ మాత్రమేనని స్పష్టం చేశారు. గతంలో పంపిణీ చేసిన దొడ్డు బియ్యాన్ని ప్రజలు వినియోగించకుండా విక్రయించడం లేదా రీసైక్లింగ్ అక్రమాలకు గురికావడంతో ప్రభుత్వ ధనం తీవ్రంగా వృథా అయ్యేదని గుర్తుచేశారు. ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న సన్న బియ్యం ఎంతో నాణ్యంగా ఉండటంతో లబ్ధిదారులే స్వయంగా వండుకుని తింటున్నారు. రేషన్ దుకాణాల్లో ఒక్క గింజ తక్కువ వచ్చినా డీలర్లను ప్రశ్నించే స్థాయికి

మిగతా 2 లో...

# ఖమ్మం మున్సిపాలిటీ కార్పొరేషన్‌లో అవినీతి, అక్రమాలపై బీఆర్ఎస్ ముట్టడి




**కాంగ్రెస్ నాయకులు, అధికారుల కుమ్మక్కుతో ప్రజా ధనం దోపిడీ జరుగుతోందని బీఆర్ఎస్ నేతల ఆరోపణ**

**ఖమ్మం ప్రతినిధి: (ప్రజా జ్యోతి ) ఆగస్టు: 6** ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో జరుగుతున్న అవినీతి, అక్రమాలు, ప్రజా సమస్యలు, పరిపాలనా వైఫల్యాలపై గురువారం భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ ఆధ్వర్యంలో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టడించి డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ వినతిపత్రాన్ని సమర్పించారు. వినతిపత్రంలో నగరంలోని పారిశుద్ధ్యం, తాగునీరు, రోడ్లు, వీధి దీపాలు, పార్కుల నిర్వహణ, అక్రమ నిర్మాణాలు, ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యం తదితర అంశాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఖమ్మం నగర బీఆర్ఎస్ పార్టీ మాజీ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, ఆర్జేసీ కృష్ణ, కర్ణాటి కృష్ణ, బచ్చు విజయ్ కుమార్

మిగతా 2 లో...

# ఫోన్ కాల్ కు స్పందించిన ఆహార శాఖాధికారులు...!

- మండల కేంద్రంలో విస్తృత తనిఖీలు..శాంపిల్స్ సేకరణ



2 లో...

# ప్రజా ఆకాంక్షలే పరమావధిగా పాలన



మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

- కూసుమంచి మండలంలో రూ.6.74 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**పాలేరు ఆర్.సీ ఆగస్టు 6 ప్రజా జ్యోతి** ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేయడమే ప్రజా ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.తో కలిసి కూసుమంచి మండలంలో ఆయన విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల పురోగతే లక్ష్యంగా రూ.6.74 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేసి శంకుస్థాపనలు చేశారు. రాజుపేట బజార్ గ్రామం వద్ద ఈశ్వరమాదారం నుంచి భద్రుతండా వరకు రూ.1.76 కోట్లతో, తాళ్లగడ్డ తండా వరకు రూ.50 లక్షలతో బీటీ రోడ్ల నిర్మాణానికి మంత్రి శ్రీకారం చుట్టారు. అనంతరం చౌటుపల్లి గ్రామంలో రూ.3.20 కోట్లతో నిర్మించనున్న హైలెవెల్

మిగతా 2 లో...

## పేదలకు 'సన్న' భరోసా!




(మొదటి పేజీ తరువాయి... )

ప్రజల్లో చైతన్యం రావడం శుభపరిణామమని మంత్రి పొంగులేటి వ్యాఖ్యానించారు. మారిన పరిస్థితి సంతోషకరం. లబ్ధిదారులు గతంలో ఇచ్చే బియ్యాన్ని తినలేక బయట విక్రయించేవాళ్లమని, ఇప్పుడు ప్రభుత్వం ఇస్తున్న సన్నబియ్యం నాణ్యత ఎంతో బాగుండటంతో ఇంట్లోనే వినియోగిస్తున్నామని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం తమ కుటుంబాలకు ఎంతో లబ్ధి చేకూరుస్తోందని హర్షం ప్రకటించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్, పంచాయతీరాజ్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ సైదులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, రేషన్ డీలర్ వై. సైదిరెడ్డి, స్థానిక గ్రామస్థులు పాల్గొన్నారు.

## బెటాలియన్‌లో ఘనంగా జయశంకర్ సార్ జయంతి వేడుకలు



(మొదటి పేజీ తరువాయి... )

చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమాండెంట్ మాట్లాడుతూ, ప్రొఫెసర్ జయశంకర్ గొప్ప విద్యావేత్త, తెలంగాణ సిద్ధాంతకర్తగా చిరస్థాయిగా నిలిచారని కొనియాడారు. తెలంగాణ ఉద్యమానికి తన జీవితాన్నే అంకితం చేసిన మహనీయుడిగా ఆయన సేవలను స్మరించారు. నాన్–ముల్కీ ఉద్యమం, సాంబార్–ఇడ్లీ గో బ్యాక్ ఉద్యమం వంటి తెలంగాణ హక్కుల ఉద్యమాలలో ఆయన చురుకుగా పాల్గొన్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తన కళ్లారా చూడాలని ఎన్నోసార్లు ఆకాంక్షించిన జయశంకర్ గారు, 2011 జూన్ 21న ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కంటే ముందే మరణించారని పేర్కొన్నారు. ఆయన ఆశయాలు, సిద్ధాంతాలను సాకారం చేసే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ. పి. ఉదయ్ కుమార్, ఆర్.ఎస్.ఐలు బి. నవీన్ కుమార్, సాయికుమార్, ఆర్. సూర్య, లక్ష్మణ్ పటాలపు, ఇతర అధికారులు, సిబ్బంది, మినిస్టీరియల్ స్టాఫ్ మరియు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పాల్గొని ఆచార్య జయశంకర్ కు ఘనంగా నివాళులర్పించారు.

## ఫోన్ కాల్ కు స్పందించిన ఆహార శాఖాధికారులు...!

**నేలకొండపల్లి, ఆగస్టు 6 ప్రజా జ్యోతి :** మండల కేంద్రంలో తిను బండరాలు..నాణ్యత ప్రమాణాలు పాటించటం లేదని...కాలం చెల్లిన ఆహార పదార్థాలు విక్రయిస్తున్నారని...ఆహార శాఖ కమీషనర్ కు ఫోన్ కాల్ చేశారు. అంతే స్పందించిన అధికారి వెంటనే తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలో ఖమ్మం జిల్లా ఆహార తనిఖీ అధికారులు విస్తృతంగా తనిఖీలు... చేపట్టారు. నేలకొండపల్లి లో పలు బేకరీలలో జిల్లా ఫుడ్ ఇన్స్పెక్టర్ వి.శరత్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. పలు దుకాణాల లో వివిధ ఆహార పదార్థాల శాంపిల్స్ ను–సేకరించారు. పలు తిను బండరాలను తూకం వేసి.. వాటి ధరలను తెలుసుకున్నారు. తినుబండరాల ఫ్యాకెట్ల ను పరిశీలించారు. వాటి పై ముద్రలను. గడువు తేది లను పరిశీలించారు. ఆహార పదార్థాలు నాణ్యత ప్రమాణాలు పాటించకుండా తయారు చేయటం...కాలం చెల్లిన పదార్థాలను విక్రయిస్తున్నారని మండల కేంద్రం లో ఆహారం కల్తీ పెద్ద ఎత్తున జరుగుతుందని...మొక్కుబడి దాడులు కాకుండా..నిరంతరం తనిఖీలు చేపట్టి..ప్రజలకు నాణ్యమైన తినుబండరాలను అందించేలా చర్యలు తీసుకోవాలని పలువురు స్థానికులు అధికారులను కోరారు.



# ప్రజా ఆకాంక్షలే పరమావధిగా పాలన





(మొదటి పేజీ తరువాయి... )

వంతెనకు, లింగారం తండాలో రూ.1.28 కోట్లతో చేపట్టనున్న ఆర్అండ్‌బీ బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. గతంలో తాను ఎంపీగా ఉన్న సమయంలో చౌటుపల్లి గ్రామాన్ని దత్తత తీసుకుని అనేక అభివృద్ధి పనులు చేశానని, ఇప్పుడు మంత్రిగా గ్రామంలోని మిగిలిన అన్ని పనులనూ పూర్తి చేసే బాధ్యత తనదేనని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక లింగారం తండాలోనే రూ.5.45 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టామని, తండాలో వీధిదీపాల ఏర్పాటును తక్షణమే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా తెలంగాణలోని ప్రతీ రేషన్ కార్డుదారునికి ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని మంత్రి తెలిపారు. గృహ నిర్మాణ రంగానికి ప్రాధాన్యమిస్తూ తొలి విడతలో 4.5 లక్షలు, మలి విడతలో 2.5 లక్షలు, హైదరాబాద్‌కు మరో లక్ష కలిపి మొత్తం 8 లక్షల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశామని వెల్లడించారు. కొద్ది రోజుల్లోనే రెండో విడత ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా ప్రారంభిస్తామన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా రైతు భరోసా నిధులను ఇప్పటికే జమ చేశామని, వరి కొనుగోళ్లలో సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తున్నామని పేర్కొన్నారు. పాలేరు నియోజకవర్గ పరిధిలో భూ రీ–సర్వే ప్రక్రియ వేగంగా జరుగుతోందని, త్వరలోనే నకిలీ పాస్‌పుస్తకాలను రద్దు చేసి, అర్హులైన ప్రతీ నిజమైన రైతుకూ న్యాయబద్ధమైన పట్టాదారు పాస్‌పుస్తకాలు అందజేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం ముందడుగు వేస్తుందని పేర్కొన్నారు.

### ♦ రైతులతో మమేకమైన మంత్రి

అభివృద్ధి పనుల పరిశీలన అనంతరం లింగారం తండాలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్వయంగా పొలంలోకి దిగి ఎద్దుల అరక పట్టి దుక్కి దున్నారు. స్థానిక రైతులతో కలిసి ముచ్చటించి, వ్యవసాయ పరిస్థితులు, పంటల పురోగతిపై ఆరా తీశారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ వెంకట్‌రెడ్డి, డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి, ఆర్అండ్‌బీ అధికారులు, ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ సైదులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఖమ్మం మున్సిపాలిటీ కార్పొరేషన్‌లో అవినీతి, అక్రమాలపై బీఆర్ఎస్ ముట్టడి



(మొదటి పేజీ తరువాయి... )

మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఖమ్మం కార్పొరేషన్ అవినీతికి అడ్డాగా మారిందని తీవ్రస్థాయిలో విమర్శించారు. వారు మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో భారీ ఎత్తున లంచాలు తీసుకుంటూ పట్టుబడిన అధికారుల వ్యవహారం ఖమ్మం కార్పొరేషన్‌లో అవినీతి ఏ స్థాయికి చేరుకుందో ప్రజలకు స్పష్టంగా తెలిసిపోయిందని అన్నారు. అలాంటి అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాల్సింది పోయి, కాంగ్రెస్ నాయకులు, అధికారులు ఒకటై ఈ దారుణాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇందిరమ్మ ఇండ్ల పేరుతో పేదల ఆశలను దోచుకుంటున్న వారిపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో డీజిల్ వినియోగంలో భారీ అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు. బ్రేక్‌డౌన్ అయిన లేదా వినియోగంలో లేని కార్పొరేషన్ వాహనాల నంబర్లను నమోదు చేసి అక్రమంగా డీజిల్ తీసుకుంటున్నారని, అధికారులు, కాంగ్రెస్ నాయకులు కుమ్మక్కై ఆ డీజిల్‌ను సొంత వాహనాలకు వినియోగించడంతో పాటు కొంత డీజిల్‌ను బయట విక్రయిస్తూ ప్రభుత్వ ఖజానాకు భారీ నష్టం కలిగిస్తున్నారని విమర్శించారు. ఈ వ్యవహారంపై స్వతంత్ర సంస్థతో సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజల సౌకర్యార్థం నగరంలోని పలు ప్రాంతాల్లో పబ్లిక్ టాయిలెట్లతో పాటు వాటికి అనుబంధంగా షాపింగ్ కాంప్లెక్సులను నిర్మించామని తెలిపారు. ఆ సమయంలో పారదర్శక టెండర్ విధానంలో షాపులను కాంట్రాక్టర్లకు కేటాయించి, వారే ఆయా పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణ బాధ్యతలు చేపట్టే విధంగా వ్యవస్థను ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ విధానాన్ని పూర్తిగా ధ్వంసం చేసి, కాంగ్రెస్ నాయకులు మరియు వారికి సంబంధించిన వ్యక్తులకు మాత్రమే షాపులను కేటాయించి, ప్రజల కోసం నిర్మించిన పబ్లిక్ టాయిలెట్లను మూసివేసే పరిస్థితి తీసుకొచ్చారని ఆరోపించారు. ప్రజల సౌకర్యాలను పక్కనబెట్టి, ప్రజా ఆస్తులను రాజకీయ ప్రయోజనాలకు వినియోగిస్తున్న వారిపై పూర్తి స్థాయి విచారణ జరిపి నిజాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఖమ్మం నగ



రంలో పారిశుద్ధ్య వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిపోయిందని, డ్రైనేజీలు శుభ్రం చేయకపోవడం వల్ల మురుగు నీరు రోడ్లపైకి వస్తోందని, తాగునీటి సమస్యలు, వీధిదీపాలు వెలగకపోవడం, రోడ్ల దుస్థితి, పార్కుల నిర్వహణలో నిర్లక్ష్యం, అక్రమ నిర్మాణాలపై చర్యలు లేకపోవడం వంటి సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ అన్ని అంశాలను వినతిపత్రంలో సమగ్రంగా ప్రస్తావించినట్లు తెలిపారు. ఖమ్మం కార్పొరేషన్‌లో జరుగుతున్న ప్రతి అవినీతి, అక్రమంపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులైన అధికారులు, ప్రజా ప్రతినిధులు ఎవరైనా సరే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే, ఖమ్మం నగర ప్రజలను సమీకరించి బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మరింత ఉధృతమైన ప్రజా ఉద్యమాలు చేపడతామని పగడాల నాగరాజు, ఆర్జేసీ కృష్ణ, కర్ణాటి కృష్ణ, బచ్చు విజయ్ కుమార్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఖమర్, ఆంధ్ర బ్యాంకు చెర్మన్ బి.రెడ్డి నాగచంద్రారెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ బత్తుల మురళి, మాజీ కార్పొరేటర్లు షేక్ మక్బూల్, తోట రామారావు, మాటేటి నాగేశ్వరరావు, శీలంశెట్టి వీరభద్రం, పల్లా రోజ్ లీనా, బిక్కసాని ప్రశాంత లక్ష్మి , దండా జ్యోతి రెడ్డి, కూరాకుల వలరాజు, పసుమర్తి రామ్మోహన్, బుర్రి వెంకట్ , మైనారిటీ నాయకులు తాజుద్దీన్, భోజట్ల రామ్మోహన్, పాలడుగు పాపారావు, ఊటుకూరి రవికాంత్, బొమ్మెర రామ్మూర్తి, మాజీ కౌన్సిలర్లు పొన్నం వెంకటేశ్వర్లు, కొప్పెర నరసింహారావు, అలాగే దడాల రఘు, వంగాల వెంకట్ , వంగవీటి శీను, దేవభక్తుని కిషోర్, షకీనా, గొల్లపూడి రాంప్రసాద్, డోలే సాయి, తోట రమేష్, లింగనబోయిన సతీష్, మిట్టపల్లి రవి, చేతి కృష్ణ, మాటేటి కిరణ్, బలుసు మురళీకృష్ణ, వాంకుడోత్ సురేష్, కందాల వీరేందర్, కార్మిక నాయకులు పాషా,సత్తార్ మియా ,హెచ్చు ప్రసాద్, చిట్టెంశెట్టి పరమేష్, బండారు శ్రీనివాసరావు, ఎర్రంశెట్టి రవి, పాషా, గడ్డం త్రిలోక్, సద్దాం, కాట్రాల దినేష్, ఆరంపల వీరభద్రం, మోహిన్, ఈశ్వర్, చిన్న మల్లేశం, కోటి, కోలేటి రాధా, తొట్టి కొమరయ్య, మోరంపూడి సాయి, సూత్రాల శీను, నన్నేబోయిన సురేష్, యడెల్లి బిక్షం,విడతల రామ్మూర్తి, సైదా హుస్సేన్, హిమాస్, జానీ, మున్నా, చోటు, చంటి, నారమళ్ల వెంకన్న, అశోక్, టుడేటి లింగరాజు, మాధవి,ఉస్మాన్ బురాన్ జావిద్, తలారి కిట్టు, రామాంజనేయులు, రంగాచారి, పోలేపొంగు వెంకట్ ,తీగల సతీష్‌గౌడ్, బుజ్జి అశోక్, భాష, పొంగి వెంకటేశ్వర్లు, తాజ్ తదితర బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పి.ఎస్.ఆర్ ట్రస్ట్ ద్వారా పాఠశాలకు విద్యా సామాగ్రి వితరణ



**సత్తుపల్లి ఆగస్టు06(ప్రజా జ్యోతి)** పొంగులేటి రాఘవరెడ్డి స్వరాజ్యం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీమతి పొంగులేటి మాధురి సుమారు రూ.25 వేల విలువైన విద్యా సామగ్రిని పట్టణంలోని వెంగల్ రావు నగర్ పాఠశాలకు విద్యాసామాగ్రిని గురువారం అందజేశారు. విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, వాటర్ బాటిల్స్, రైటింగ్ ప్యాడ్లు, టేబుల్ బుక్స్, పెన్నులు, పెన్సిల్స్, చూచిరాత పుస్తకాలు, కలర్ పెన్సిల్స్, క్లాస్‌మేట్ నోటుబుక్స్ తదితర సామగ్రిని పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాశాఖ అధికారి శ్రీ ఎన్. రాజేశ్వరరావు మాట్లాడుతూ, పి ఎస్ ఆర్ ట్రస్ట్ ద్వారా విద్యార్థులకు ఇలా అందించటం అభినందనీయమని, వీటి ద్వారా విద్యార్థులు విద్య నేర్చుకోవడానికి దోహదపడతాయని, ట్రస్ట్ అధినేతలకు అభినందనలు తెలియజేశారు. విద్యార్థులను ప్రతిరోజూ క్రమం తప్పకుండా పాఠశాలకు పంపాలని, ఇంటి వద్ద కూడా రోజూ చదివించేలా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తు బాగుండాలంటే పాఠశాల, తల్లిదండ్రులు, సమాజం కలిసి పనిచేయాలని ఆయన సూచించారు.ఈ సందర్భంగా ఇటీవల పాఠశాలకు డెస్క్–బెంచీలు అందించిన ఎంఈఓ శ్రీ ఎన్. రాజేశ్వరరావు విద్యార్థుల తల్లిదండ్రులు ఘనంగా సన్మానించి తమ కృతజ్ఞతలను తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధుసూదన్ రావు, సహోపాధ్యాయులు శ్రీనివాస రెడ్డి, ఏ ఏ పీ ఎస్ చైర్మన్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.విద్యార్థుల సంక్షేమం కోసం ఉదారంగా సహకరించిన పొంగులేటి రాఘవరెడ్డి స్వరాజ్యం చారిటబుల్ ట్రస్ట్, శ్రీమతి పొంగులేటి మాధురి, కార్యక్రమానికి విచ్చేసిన గౌరవ తల్లిదండ్రులకు మరియు సహకరించిన ప్రతి ఒక్కరికీ వెంగళరావు నగర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# తల్లిపాలతో వ్యాధి నిరోధక శక్తి

- ఐసిడిఎస్ సూపర్వైజర్ రజని





**సత్తుపల్లి ఆగస్టు06 (ప్రజా జ్యోతి)** తల్లిపాలలో పోషక విలువలు మెండుగా ఉం టాయని, తల్లిపాలు తాగిన పిల్లలలో వ్యాధి నిరోధక శక్తి అధికంగా ఉంటుందని,వ్యాధులు దరి చేరవని ఐసిడిఎస్ సూపర్వైజర్ రజని అన్నారు. గురువారం మండల పరిధిలోని యాతాల కుంట గ్రామంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాలు ఏర్పాటు చేసినారు. ఈ కార్యక్రమానికి ఆమె హాజరై, అనంతరం మా ట్లాడుతూ తల్లిపాలు తాగిన పిల్లల్లో తెలివితేటలు, చురుకుదనం అధికంగా ఉం టాయని అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా తల్లి బిడ్డ అనుబంధా న్ని, తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేసే విధంగా అంగన్వాడి టీచర్లు గీసిన చి త్రం గురించి తెలియజేస్తూ సమావేశానికి వచ్చిన గర్భిణీలు, బాలింతలు, తల్లులు, కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రా మ సర్పంచ్ తాటి ఈశ్వరి, ఉప సర్పంచ్ మధుసూదన్ రెడ్డి, వార్డు మెంబర్ ర మాదేవి, అంగన్వాడి టీచర్లు నాగమణి, రాణి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్ వినియోగదారులు తప్పనిసరి కేవైసీ చేసుకోవలెను

- దోసపాటి కళ్యాణి



**మధిర ప్రజా జ్యోతి** గ్యాస్ వినియోగదారులు తప్పనిసరిగా ఈ నెల 15 లోపు కేవైసీ చేయించుకోవాలని మధిర శ్రీ సాయి వెంకటేశ్వర హెచ్పీ గ్యాస్ ఏజెన్సీ డిస్ట్రిబ్యూటర్ దోసపాటి కళ్యాణి తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశానుసారం ఈనెల 15 లోపు గ్యాస్ కనెక్షన్ ఉన్న ప్రతి ఒక్కరు కేవైసీ చేయించుకోవాలని లేనిపక్షంలో గ్యాస్ సిలిండర్ తోపాటు సబ్సిడీ రాదు అని తెలిపారు.అంతేకాకుండా.గత రెండు సంవత్సరాల నుండి కేంద్ర ప్రభుత్వం కేవైసీ చేయించాలని చెప్తున్నప్పటికీ వినియోగదారులు జాప్యం చేస్తున్నారన్నారనీ ,ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగస్టు 15 లోపు కేవైసీ చేయించుకోవాలని, మీ సమీపంలోని గ్యాస్ ఏజెన్సీ వద్ద గాని, గ్యాస్ డెలివరీ బోయ్ వద్ద గాని కేవైసీ చేయించుకోవచ్చు అన్నారు. ఉజ్వల కనెక్షన్ దారులు కేవైసీ చేయించుకోని ఎడల 350 రూపాయలు సబ్సిడీ నిలిపివేయబడుతుందని, ఈనెల 16 నుండి కేవైసీ చేయించుకొని గ్యాస్ వినియోగదారులు కమర్షియల్ ధర లోకి వెళ్ళటం జరుగుతుందని దీని మూలంగా 2500 నుండి 3000 వరకు గ్యాస్ కొనుగోలు చేయవలసి వస్తుందని తెలిపారు. ఇప్పటికే అధికారులు, డీలర్లు, సోషల్ మీడియా కరపత్రాల ద్వారా కూడా విశేష ప్రచారం నిర్వహించినప్పటికీ జిల్లాలో ఎక్కువ సంఖ్యలో వినియోగదారులు కేవైసీ చేయించుకోలేదని దీని మూలంగా వినియోగదారులతో పాటు డీలర్లు కూడా ఇబ్బందులు ఎదుర్కొన వలసి వస్తుందని ఆమె తెలిపారు.

# గర్భిణులు,బాలింతల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత రామనాధం




**మధిర ప్రజా జ్యోతి** తల్లిపాల వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ప్రత్యేక వేడుకల్లో భాగంగా గర్భిణులకు శ్రీమంత వేడుకలు,చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలను అత్యంత ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకల్లో మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత మాట్లాడుతూ,గర్భిణులు మరియు బాలింతల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు.నేటి ఆధునిక కాలంలోనూ ఎలాంటి హంగు ఆర్భాటాలకు పోకుండా,మన సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఇలాంటి వేడుకలను నిర్వహించడం ఎంతో అభినందనీయమని కొనియాడారు.గర్భస్థ దశ నుంచే సరైన పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమవుతుందని,తద్వారా భావి భారత పౌరులైన చిన్నారులు ధృఢంగా ఎదుగుతారని ఆమె పేర్కొన్నారు.కమిషనర్ సామ్యూల్ పాల్ మాట్లాడుతూ, ఐసీడీఎస్ మరియు అంగన్వాడీ వ్యవస్థల ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అందుతున్న సేవలు పేద ప్రజలకు శ్రీరామరక్ష లాంటివని అభివర్ణించారు. పీడీ ఏ.ప్రమీల,సీడీపీఓ జి.కృష్ణశ్రీ మరియు ఎస్సీడీపీఓ షకీరా తదితరుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం దిగ్విజయంగా సాగడం సంతోషకరమని అన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు సంప్రదాయబద్ధంగా ఓడీ పోసి,అక్షితలు వేసి ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బంది,అంగన్వాడీ టీచర్లు,సూపర్వైజర్లు గర్భిణీ స్త్రీలు,చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

# తల్లిపాలు రోగ నిరోధక శక్తి పెంచుతుంది



**నేలకొండపల్లి, ఆగస్టు 6 ప్రజా జ్యోతి :** తల్లిపాలు అమృతంతో సమానమని కొత్తకొత్తూరు సర్పంచ్ మాలోత్ కళావతి అన్నారు. మండలం లోని కొత్తకొత్తూరు లోని అంగన్వాడీ కేంద్రంలో గురువారం తల్లిపాల వారోత్సవం ను నిర్వహించారు. తొలుత అక్షరాభ్యాసం కార్యక్రమం ను చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు...తల్లిపాలు రోగ నిరోధక శక్తి ని పెంచుతుందన్నారు. ముర్రుపాలు బిడ్డ ఆరోగ్యం ను కాపాడుతుందన్నారు. అంగన్ వాడీ కేంద్రాలను ప్రభుత్వం బలోపేతం చేస్తుందన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో అందించే పౌష్టికాహారం ను గర్భీణీలు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మాతా, శిశు సంరక్షణ కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఉప సర్పంచ్ వల్లాల రాధా కృష్ణ, పంచాయతీ కార్యదర్శి . రవి, వార్డు సభ్యులు ఠాగూర్ రాంసింగ్, ఏఎనీయం రమణ, ఆశా "కార్యకర్త అరుణ, అంగన్వాడీ టీచర్ స్వాతి. చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు

# సింగరేణి మండలంలో ఘనంగా జయ శంకర్ జయంతి వేడుకలు



**కారేపల్లి, ఆగస్టు 6, ప్రజా జ్యోతి:** సింగరేణి మండల పరిధి లోని ప్రభుత్వ కార్యాల యాల లో వివిధ ప్రైవేట్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో గురువారం తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా సింగరేణి మండలం టేకులగూడెం గ్రామపంచాయతీ కార్యాలయంలో సింగరేణి ఎంపీడీవో బి పద్మ, ఎంపీవో మల్లెల రవీంద్ర ప్రసాద్ ల ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రొఫెసర్ జయశంకర్ చేసిన విశిష్ట సేవలు, త్యాగాలు, వారి ఆలోచనలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. వారి ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వారన్నారు. అనంతరం గ్రామంలో కలియ తిరుగుతూ రోడ్లను పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడుతూ వర్షాకాల సీజన్ ప్రారంభమైనది, అందరూ ఆరోగ్యపరమైన సూచనలు పాటించాలి ,తగు జాగ్రత్తలు తీసుకోవాలి ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి నీటి నిలువ లేకుండా చూసుకోవాలి అని పలు సూచన చేశారు.ఈ కార్యక్రమం లో పంచాయతీ కార్యదర్శి, ఎస్ బి ఎం జక్రియ , పాలక వర్గ సభ్యులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# జయశంకర్ ఆశయాల సాధనకు కృషి చేయాలి

- కల్లూరులో ఘనంగా జయశంకర్ జయంతి వేడుకలు

**కల్లూరు ఆగస్టు 06 : ప్రజా జ్యోతి** తెలంగాణ రాష్ట్ర సిద్ధాంతకర్త ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలను కల్లూరు మున్సిపాలిటీ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి మున్సిపల్ చైర్మన్ ధారావత్ మోహన్ నాయక్, మున్సిపల్ కమిషనర్ జి. సాయి కృష్ణారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ మోహన్ నాయక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ చేసిన త్యాగాలు సేవలు చిరస్మరణీయమని అన్నారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం స్వాభిమాన సాధన కోసం ఆయన జీవితాంతం కృషి చేశారని కొనియాడారు. యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు మున్సిపల్ కమిషనర్ జి సాయి కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ విద్యావేత్తగా ఉద్యమకారుడిగా తెలంగాణ చరిత్రలో చెరగని ముద్ర వేశారని పేర్కొన్నారు. ప్రజాసేవలో నిబద్ధత నిజాయితీ బాధ్యతతో పనిచేయడం ద్వారానే ఆయన ఆశయాలకు నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని అన్నారు. ప్రజాక్షేమం అభివృద్ధి పారదర్శక పాలన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రజాప్రతినిధులు అధికారులు మున్సిపల్ సిబ్బంది ప్రొఫెసర్ జయశంకర్ సేవలను స్మరించుకుని ఆయన ఆశయ సాధనకు అంకితభావంతో పని చేయాలని సంకల్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ శీలం కోటేశ్వరి కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు లక్కినేని రఘు, జిల్లెల్ల స్వాతి, బీరెల్లి మాధవరావు, దాసరి సుధారాణి, భూక్యరాంబాయి, బానోతు మారోని, కళ్యాణపు నవ్య, పెద్ద బోయిన లక్ష్మీనరసింహారావు, కిష్టంశెట్టి లక్ష్మీ, మహమ్మద్ ఇస్మాయిల్, దార్ల చిన్నలక్షి , ఉబ్బన రాంబాబు, కనపర్తి శ్యామల, పడకంటి రామకృష్ణ, ఖమ్మం పాటి రాధా వీరయ్య, గుండ్ల పుల్లారావు, మున్సిపల్ మేనేజర్ నందిశెట్టి నాగేశ్వరావు, కార్యాలయ సిబ్బంది, శానిటేషన్ కార్మికుల పాల్గొన్నారు.



## బాలికాసాధికారత తోనే బలమైన కుటుంబ వ్యవస్థ

- రిటైర్డ్ హెచ్ఎం యండ్రపల్లి పద్మావతి




**మధిర ప్రజా జ్యోతి** మున్సిపాలిటీ పరిధిలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మడుపల్లి నందు పాఠశాల ప్రధానోపాధ్యాయులు తోట నరసింహా రావు అధ్యక్షతన నిర్వహించిన జి సి ఇ సి ప్రత్యేక సమావేశంలో ముఖ్య అతిథులుగా విశ్రాంత ప్రధానోపాధ్యాయిని యండ్రపల్లి పద్మావతి, మహాత్మ జ్యోతిబా పూలే బాలికల కళాశాల ఎర్రుపాలెం కెమిస్ట్రీ లెక్చరర్ షేక్ హసీనా ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. బాలికల సాధికారతోనే మహిళా సాధికారత సాకారమవుతుందని ఇందుకోసం విద్యార్థులంతా బాల్యం నుంచే వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ఉజ్వల భవిష్యత్తు కోసం అంది వచ్చే ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ మంచి క్రమశిక్షణతో ఉన్నతమైన వ్యక్తిత్వం దిశగా పయనించాలని తద్వారా భవిష్యత్ భారత దేశంలో పటిష్టమైన కుటుంబ వ్యవస్థకు మహిళా సాధికారతకు అంకురార్పణ జరుగుతుందని ముఖ్య అతిథులు ఉద్ఘాటించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థులకు అందించే అన్ని రకాల సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ మంచి పౌష్టికాహారంతో ఆరోగ్యాన్ని పరిరక్షించుకుంటూ విద్యార్థినిలు అన్ని రకాల నైపుణ్యాలను నేర్చుకుంటూ భవిష్యత్తు కోసం అహర్నిశలు శ్రమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్తగా జి సి ఇ సి సెక్రెటరీ సంధ్యా లక్షి గారు, మహాత్మ జ్యోతిబాపూలే బాలికల పాఠశాల ఎర్రుపాలెం ఆంగ్ల ఉపాధ్యాయిని చిలకమర్రి శృతి, మడుపల్లి ఉన్నత పాఠశాల పాఠశాల ఉపాధ్యాయినిలు శైలజ, శ్రీదేవి, సంగీత ఉపాధ్యాయిని మాధవి, అగ్రికల్చర్ ఉపాధ్యాయిని సుష్మ, ఉపాధ్యాయులు,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్య అతిథులకు పాఠశాల ఉపాధ్యాయ బృందం కార్యక్రమానంతరం చిరు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

## భూ రీ-సర్వే కు పూర్తిగా సహకరించాలి

- సర్వేలో ప్రతీ రైతు పాల్గొనాల్సిందే



**నేలకొండపల్లి, ఆగస్టు 6 ప్రజా జ్యోతి :**తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రీ–సర్వే కు రైతులు పూర్తి స్థాయిలో సహకరించాలని నేలకొండపల్లి తహశీల్దార్ పి.రాంప్రసాద్ సూచించారు. మండలం లోని ఆచార్లగూడెం, అనాసాగారం, కోనాయిగూడెం గ్రామాలలో గురువారం భూ రీ–సర్వే గ్రామ సభ ను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు...ఈ సర్వే తో గ్రామాలలో రైతుల మధ్య ఉన్న భూ వివాదాలు చాలా వరకు తగ్గుతాయన్నారు. ఆధునిక యంత్రాల ద్వారా సర్వే జరుగుతుందన్నారు. కావునా ప్రతీ రైతు ఈ సర్వేలో పాల్గొనాలని సూచించారు. సర్వే అనంతరం రైతులకు కొత్త పట్టాదారు పాసు పుస్తకాలతో పాటు మ్యాపింగ్ ను అందిస్తామన్నారు. ఈ అవకాశంను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సర్వే లో పాల్గొని రైతులు వారి భూములను రికార్డులలో భద్రపరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ యం.యర్రయ్య, మండల రెవిన్యూ ఇన్సెపెక్టర్ ఆలస్యం మధుసూధన్రావు, గ్రామ పరిపాలన అధికారి దోమల రామకృష్ణ, ఆయా పంచాయతీ సర్పంచ్లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## జైల్ బరో కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

- మధిర డివిజన్ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు బంధం శ్రీనివాసరావు

**బోనకల్, జులై 6(ప్రజా జ్యోతి):**వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ, రైతు సంఘం ఆధ్వర్యంలో ఈనెల 10వ తారీఖున దేశవ్యాప్తంగా జరగబోవు జైల్ బరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మధిర డివిజన్ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు బంధం శ్రీనివాసరావు అన్నారు. ఈ సందర్భంగా జైల్ బరో ను జయప్రదం చేయండి పాంప్లెట్ ను గురువారం బోనకల్ మండల కేంద్రంలో మధిర డివిజన్ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు బంధం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వివిధ ప్రజాసంఘాల బాధ్యులు కరపత్రాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా బంధం శ్రీనివాసరావు మాట్లాడుతూ... బ్రిటిష్ వారిని పారద్రోలుటకు క్విట్ ఇండియా ఉద్యమాన్ని చేపట్టినట్టు ఈరోజు మన భారతదేశాన్ని పాలించే పాలకులు దేశాన్ని దోచుకుంటూ అవినీతికి, అక్రమాలకు పాల్పడుతున్నారని, మతతత్వాన్ని రెచ్చగొడుతున్నారని వ్యవసాయ కార్మికులకు, సిఐటియు కార్మికులకు, రైతులకు ఉన్నటువంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని లేనిచో మమ్మల్ని



జైల్లో పెట్టండి అనే నినాదంతో ఈనెల 10వ తారీకు బోనకల్ మండల కేంద్రంలో జరుగుతున్న జైలు బరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం బోనకల్ మండల అధ్యక్షుడు తెల్లాకుల శ్రీనివాసరావు, మండల కమిటీ సభ్యులు ఉప్పర శ్రీను, గంగుల నాగేశ్వరరావు, రైతు సంఘం నాయకులు గద్ద రామారావు, పంతంగి సత్యనారాయణ, సిఐటియు నాయకులు నారపోగు జాన్ సైమన్, చెన్న లక్ష్మాద్రి, గడ్డికొప్పుల పుల్లయ్య, మహిళా సంఘం మధిర డివిజన్ కమిటీ సభ్యులు తెల్లాకుల రజని, బొబ్బిళ్ళపాటి కుమారి తదితరులు పాల్గొన్నారు.

# వర్షాకాల వ్యాధులపై అప్రమత్తత అవసరం

- పరిశుభ్రతతోనే ఆరోగ్య రక్షణ
- కూసుమంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం. డాక్టర్ సాయికుమార్

**పాలేరు ఆర్. సీ ఆగస్టు 06 ప్రజాజ్యోతి** వర్షాకాలం ప్రారంభమై నేపథ్యంలో మండల ప్రజలందరూ సీజనల్ వ్యాధుల పట్ల తీవ్ర అప్రమత్తంగా ఉండాలని కూసుమంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సాయికుమార్ అన్నారు. ఈ సందర్భంగా కూసుమంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ సాయికుమార్ మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితులు వల్ల వ్యాధులు ప్రజలకు ప్రమాదంగా ఉందని ముందస్తు జాగ్రత్తలు పాటించకద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని ఆయన స్పష్టం చేశారు.



**ప్రజలకు ప్రమాదకర ఉన్న వ్యాధులు....**

ఈ కాలంలో నీరు నిల్వ ఉండటం తాగునీరు కలుషితం కావడం వల్ల అనేక రకాల ఇన్ఫెక్షన్లు ప్రజలకు వచ్చే అవకాశం ఉందని డాక్టర్ సాయికుమార్ తెలిపారు.

**దోమల వల్ల:** మలేరియా, డెంగ్యూ, జరాలు,నీరు, ఆహారం ద్వారా టైఫాయిడ్ కలరా విరోచనాలు డయేరియా

**వాతావరణ మార్పులు వల్ల:** వైరల్ జ్వరాలు వాతావరణ మార్పుల వల్ల వైరల్ జ్వరాలు తీవ్రమైన దగ్గు జలుబు

**నీటి నిల్వలకు చరమగీతం:** ఇంటి పరిసరాలు ఎక్కడ వర్షపు నీరు, నిలవ ఉండకుండా చూసుకోవాలి. పాత టైర్లు కొబ్బరి బోండాలు పూల కుండీలు కూలర్లో నీటి ఎప్పటికప్పుడు పరిష్కరించి శుభ్రం చేయాలి. కాల్చి చల్లార్చిన నీరే సురక్షితం నీటి ద్వారా వ్యాపించే రోగాల బారిన పడకుండా ఉండాలంటే తాగు నీటిని బాగా చల్లార్చిన తర్వాతే తాగాలి తాజా ఆహారమే శ్రేయస్కరం ఈగలు వాలిన నిల్వ ఉన్న ఆహార పదార్థాలను తినకూడదు వేడిగా తాజాగా వండిన ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలి. చేతులు శుభ్రం భోజనం చేయడానికి ముందు బయట నుంచి వచ్చిన తర్వాత చేతులు శుభ్రంగా కడుక్కోవాలి.

**దోమలు తెర వాడటం:** రాత్రి వేళలో నిద్రించే సమయంలో తప్పనిసరిగా దోమల తెరలు లేదా దోమల నివారణ సాధనలో ఉపయోగించాలి. పరిసరాల పరిశుభ్రత ఇంటితోపాటు చుట్టుపక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. చెత్త బహిరంగ ప్రదేశాలు వేయకుండా కేవలం చెత్త కుండీలోను వేయాలి.

**స్వయం వైద్యం వద్దు పిహెచ్ సీ సేవలను వినియోగించుకోండి:**

జ్వరం దగ్గు విరోచనాలు లేదా ఏ ఇతర ఆరోగ్య లక్షణాలు కనిపించిన నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి వైద్యులను సంప్రదించాలి. మెడికల్ షాపులో నేరుగా మందులు కొను గోలు చేసి సొంత వైద్యం చేసుకోవటం ప్రాణానికే ప్రమాదం అని డాక్టర్ సాయికుమార్ హెచ్చరించారు. పరిశుభ్రత పాటిద్దాం ఆరోగ్యవంతమైన సమాజం నిర్మిద్దాం అనే సంకల్పంతో ప్రతి ఒక్కరు బాధ్యతగా మెలగాలని ఆయన ఆకాంక్షించారు.

## జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ ప్రజావాణి

- జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** గురువారం 15 వ వారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి ప్రజలు సమస్యలతో వస్తున్నారని,దరఖాస్తుల ద్వారా సమస్యలను తెలుపుతున్నారని,అట్టి దరఖాస్తులను తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు భట్టి విక్రమార్క మల్లు ద్వారా పరిష్కరిస్తున్నామని,కొన్నిటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కార దిశగా కృషి చేస్తున్నామని, గురువారం 18 దరఖాస్తులు వచ్చాయని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు పులిపాటి వెంకయ్య, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య,జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యవర్గ సభ్యులు తూములూరి లక్ష్మీ నరసింహారావు,కిలారు అనిల్ కుమార్ మూడుముంతల గంగరాజు యాదవ్ కొట్టే రాజశేఖర్, బండి మాధవ రావు, నాయిని సునీత,దామా స్వరూప, పాటి నర్సయ్య,టి పి సి సి యస్ సి సెల్ వైస్ చైర్మన్ దర్గీ చెన్నారావు,పుచ్చకాయల సోమిరెడ్డి,గోవిందు శ్రీను ,హలావత్ అర్జున్,గంగిశెట్టి ప్రసాద్,బ్రహ్మారెడ్డి,మర్సకట్ల బాబు,కిలారు వెంకటరమణ,గజ్జి సూర్యనారాయణ,ఆజ్గర్,పురుషోత్తం ,మహమూద్,పంది రాజు గౌడ్ ,ఫరీద్ ఖాద్రి ,తదితర నాయకులు పాల్గొన్నారు.

## ఆందోళనకు దిగివచ్చిన ఎంఈఓ

- 'మా టీచర్ మాకే కావాలి' అంటూ విద్యార్థులు, తల్లిదండ్రుల నిరసన
- రేమిడిచర్ల ఉన్నత పాఠశాలలోనే స్రవంతి బోధన కొనసాగింపునకు ఆదేశం





**ఎర్రుపాలెం, ప్రజా జ్యోతి** 'మా టీచర్ మాకే కావాలి' అంటూ విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, అఖిలపక్ష నాయకులు గురువారం రేమిడిచర్ల ఉన్నత పాఠశాల గేటుకు తాళం వేసి చేపట్టిన ఆందోళనకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. ఆందోళన విషయం తెలుసుకున్న ఎంఈఓ మురళీమోహన్ రావు పాఠశాల వద్దకు చేరుకుని విద్యార్థులు, తల్లిదండ్రులతో మాట్లాడా రు.ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సర్దుబాటు విషయంలో జరిగిన పరిణామాలపై చర్చించిన ఎంఈఓ పొరపాటు జరిగిందని అంగీకరించినట్లు ఆందోళనకారులు తెలిపారు. అనంతరం సోషల్ ఉపాధ్యాయురాలు స్రవంతిని తిరిగి రేమిడిచర్ల ఉన్నత పాఠశాలకు పిలిపించి, అక్కడే విధులు నిర్వహిస్తూ విద్యార్థులకు బోధన కొనసాగించాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు.స్రవంతి రేమిడిచర్ల పాఠశాలలో సోషల్ ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తూ విద్యార్థులకు బోధిస్తున్నారని, ఆమెను ఇతర పాఠశాలకు కేటాయించడంతో విద్యార్థుల చ దువుకు ఇబ్బందులు ఏర్పడతాయని తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, అఖిలపక్ష నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. తమ డిమాండ్‌పై అధికారులు సా నుకూలంగా స్పందించడంతో ఆందోళన విరమించినట్లు తెలిపా రు.విద్యార్థు ల డిమాండ్ నెరవేరడంతో హర్షం తమ ఉపాధ్యాయురాలిని తిరిగి రేమిడిచర్ల పా ఠశాలలోనే కొనసాగించేందుకు అధికారులు నిర్ణయం తీసుకోవడంతో వి ద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించిన ఎం ఈఓ కు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల విద్యాభ్యాసానికి ఎలాంటి ఆటం కం కలగకుండా ఉపాధ్యాయుల సర్దుబాట్లలో స్పష్టతతో వ్యవహరించాలని కోరారు.

# పారిశ్రామిక విద్యా పర్యటనలో యస్.బి.ఐ.టి. విద్యార్థులు



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** విద్యార్థుల్లో సృజనాత్మకత,ఆవిష్కరణాత్మక ఆలోచనలు,స్టార్టప్ వ్యవస్థ, ఇంక్యుబేషన్,హ్యాకథాన్ లు, ఐడియాథాన్ లపై అవగాహన కల్పించే లక్ష్యంతో తమ కళాశాల విద్యార్థులు హైదరాబాద్ లోని ప్రముఖ ఆవిష్కరణ కేంద్రాలైన ఉయ్-హబ్, టి-హబ్, టి-వర్క్స్ లను పారిశ్రామిక విద్యా పర్యటనలో భాగంగా సందర్శించారని కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయా సంస్థల నిపుణులు విద్యార్థులకు స్టార్టప్ ల స్థాపన, ఇంక్యుబేషన్ ప్రక్రియ, వినూత్న ఆలోచనలను వ్యాపార అవకాశాలుగా మలచే విధానం, ప్రభుత్వ ప్రోత్సాహక పథకాలు, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. హ్యాక థాన్ లు, ఐ డియాథాన్ లు విద్యార్థుల సమస్య పరిష్కార సామర్థ్యాన్ని, జట్టుగా పనిచేసే నైపుణ్యాన్ని, సృజనాత్మక ఆలోచనలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా జి. ధాత్రి తెలిపారు. టి-వర్క్స్ లో అత్యాధునిక ప్రోటోటైపింగ్ సదుపాయాలు, డిజైన్ మరియు తయారీ సాంకేతికతలను విద్యార్థులు ప్రత్యక్షంగా పరిశీలించారు.కళాశాల వైస్-ఛైర్మన్ కె.శ్రీచైతన్య మాట్లాడుతూ ఉయ్-హబ్ లో మహిళా పారిశ్రామికవేత్తలకు అందిస్తున్న ప్రోత్సాహక కార్యక్రమాల గురించి తెలుసుకోగా,టి-హబ్ లో స్టార్టప్ ల అభివృద్ధి, మెంటరింగ్, పెట్టుబడి అవకాశాలు, ప్రపంచ స్థాయి ఇంక్యుబేషన్ విధానాలపై విద్యార్థులు సమగ్ర అవగాహన పొందారని తెలిపారు.ఈ పారిశ్రామిక విద్యా పర్యటన ద్వారా విద్యార్థులు నూతన ఆవిష్కరణలు, వ్యవస్థాపకత (ఎంట్రప్రెన్యూవర్షిప్), పరిశోధన సాంకేతిక పరిజ్ఞానం పట్ల మరింత ఆసక్తిని పెంపొందించుకున్నారని, భవిష్యత్తులో హ్యాకథాన్ లు,ఐడియాథాన్ లు, స్టార్టప్ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేందుకు ఇది ఎంతో దోహదపడుతుందని కళాశాల ప్రిన్సిపాల్ డా జి. రాజ్ కుమార్ తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డా ఎ.వి.వి. శివ ప్రసాద్, ఇన్నోవేషన్ సెల్ ఇన్ ఛార్జ్ పి. అశ్విని, టి.పి.ఒ. డా యస్. సవిత పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ జయ శంకర్ కి విద్యుత్ శాఖ నివాళులు

- విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇ శ్రీనివాస చారి



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** తెలంగాణ సిద్ధాంతకర్త, నిధులు,నీళ్లు ,నియామకాలు అనే నినాదంతో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని ఎలుగెత్తి చాటి తెలంగాణ ఉద్యమానికి పునాదులు వేసిన ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ కి విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఇ శ్రీనివాసచారి,అధికారులు, ఉద్యోగులు,కార్మికులు నివాళులు అర్పించినారు. ఈ సందర్భంగా తెలంగాణ అమరవీరు లను జ్ఞాపకం చేసుకుని ,తెలంగాణ సాధించిన దానిని ముందుకు తీసుకెళ్లాలని అన్ని రంగాలలో ముఖ్యముగా విద్యుత్ శాఖలో ప్రగతి సాధిస్తున్నామని ,ఇంకా ఎంతో సాధించవలసి ఉందని అందుకే ఉద్యోగులంతా శక్తి వంచన లేకుండా పనిచేయాలని, ఖమ్మం జిల్లా వినియోగదారులు తమ సహకారాన్ని అందజేయాలని ఈ సందర్భంగా ఎస్సీ గారు తెలియపరిచినారు . ఈ కార్యక్రమంలో, డిఈ ,టెక్నికల్ కిరణ్ కుమార్, డి ఈ, వైరా వై.రమేష్, ఏ.వో . మురళి, ఎ ఓ ,రెవిన్యూ,శ్రీధర్, ,ఏడీఏ లు నాగమల్లేశ్వరరావు, ఖాదర్ బాబా, మరియు సీతారాం గోపాల్, ప్రసాద్, కిరీటా చారి,రమేష్,మహిళా ఉద్యోగులు రజిని, మానస, తదితరులు పాల్గొన్నారు.

## కామేపల్లిలో ప్రొఫెసర్ జయశంకర్ జన్మదిన వేడుకలు



**కామేపల్లి ప్రజా జ్యోతి ఆగస్టు 6** కామేపల్లి మండల బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కొత్త లింగాల కోట మైసమ్మ తల్లి ఆలయం దగ్గర ప్రొఫెసర్ జయశంకర్ గారి జన్మదిన వేడుకలు కామేపల్లి మండల బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల నాయకులు అంతోటి అచ్చయ్య సామ మోహన్ రెడ్డి మూడు కృష్ణ ప్రసాద్ అజ్మీర రాజు కాట్రాల రాంబాబు అజ్మీర కుమార్ నాయక్ జాస్తి పల్లి సర్పంచ్ ధారావత్ నాగమణి ఆదూరి ప్రసాద్ కన్నామల రాంబాబు పాలెం మధు గడ్డం వెంకటేశ్వర్లు చల్లా రమేష్ లింగనబోయిన సందు మాలోత్ కిషన్ బర్లగూడెం సర్పంచ్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## పోటీ పరీక్షల్లో సత్తా చాటిన గ్రామీణ యువతి

- జడ్జి కావడమే ధ్యేయమన్న గార్లపాటి పుష్పలత



**చింతకాని ఆగస్టు 06ప్రహజ్యోతి** :మండలం పాతర్లపాడు గ్రామానికి చెందిన గార్లపాటి పుష్పలత (సీపీజీసెట్) ప్రవేశ పరీక్షలో ఎంఎల్ఐఎస్సి (MLISc) కోర్సు విభాగంలో 251వ ర్యాంకు సాధించి తన ప్రతిభను చాటుకున్నారు.గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన పుష్పలత విద్యాభ్యాసంలో వరుస విజయాలు సాధిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈమె జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జెఎన్ టియూ) నుంచి ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగంలో బి.టెక్ (ఫస్ట్ క్లాస్), ప్రతిష్టాత్మక ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ) నుంచి ఎల్ఎల్‌బి (ఫస్ట్ క్లాస్) పూర్తి చేశారు, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాలో అడ్వకేట్‌గా నమోదు చేసుకున్నారు. హైదరాబాద్ లోని మెట్రోపాలిటన్ క్రిమినల్ కోర్టు లో న్యాయ వాడిగా ప్రాక్టీస్ చేస్తున్నారు.ఆల్టర్నేటివ్ డిస్ప్యూట్ రిజల్యూషన్' (ఎడిఆర్ ) విభాగంలో ఎల్ఎల్ఎమ్ పట్టా పొందారు.ఈ సందర్భంగా పుష్పలత మాట్లాడుతూ "గ్రామీణ, సామాజికంగా మరియు ఆర్థికంగా వెనుకబడిన ప్రజలు విద్య, ఉద్యోగాల ద్వారా మాత్రమే పేదరికం నుంచి బయటపడి అభివృద్ధి చెందగలరు. న్యాయశాస్త్రంలో డాక్టరేట్ (పిహెచ్ డి, లా ) పూర్తి చేయడంతో పాటు భవిష్యత్తులో న్యాయమూర్తి (జడ్జి) అయి సమాజానికి నిస్వార్థ సేవలు అందించడమే నా జీవిత ఆశయం" అని తెలిపారు.గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చి ఉన్నత విద్యా కోర్సుల్లో ప్రతిభ కనబరుస్తున్న పుష్పలతను పాతర్లపాడు ఉప సర్పంచ్ దారెల్లి సురేష్,గ్రామస్థులు, బంధుమిత్రులు మరియు స్థానిక ప్రజలు ఘనంగా అభినందించారు.

## సంపూర్ణ ఆరోగ్యానికి తల్లిపాలే మూలాధారం డాక్టర్ అవినాష్



**సత్తుపల్లి ఆగస్ట్06 (ప్రజా జ్యోతి)** బిడ్డ సంపూర్ణ ఆరోగ్యానికి తల్లిపాలే మూలాధారం అని, గంగారం పి హెచ్ సి వైద్యులు డాక్టర్ అవినాష్ అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అంగన్వాడి సూపర్వైజర్ మహాలక్ష్మి ఆధ్వర్యంలో, మండల పరిధిలోని గంగారం గ్రామంలో గురువారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, అనంతరం ఆయన మాట్లాడు తూ శిశువు పుట్టిన దగ్గర నుంచి తల్లిపాలు అందించాలని, తల్లిపాలలో అనేక పోషక విలువలు ఉన్నాయని, ముర్రు పాలు శిశువుకు పట్టించడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని, త్వరగా అభివృద్ధి చెందుతారని, పుట్టిన ఆరు నెలల వరకు పాలు పట్టించవచ్చని, దీని ద్వారా బిడ్డ చలాకి గా,తెలివిగా ఉంటారని గర్భిణీలకు, తల్లులకు సూచించారు. గర్భిణీలు పౌష్టికరమైన ఆహారం తీసుకోవడం వలన, బిడ్డ తల్లి క్షేమంగా ఉంటారని, మంచి ఆహారం తీసుకుంటే బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ లు విజయ కుమారి ,శారా రాణి, ఏఎన్ఎం రామా దేవి,లక్ష్మీ, ఆశాలు రాధ, చంద్రకళ ,సువర్ణ ,శిరీష, అంగన్వాడి ఆయాలు ఉన్నారు.

## రోడ్లకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలకు గడ్డి మందు కొట్టిస్తున్న సర్పంచ్

- జాటోతు జాయ్ లూసి



**కామేపల్లి ప్రజా జ్యోతి ఆగస్టు 6** కామేపల్లి మండలంలోని ముచ్చర్ల గ్రామపంచాయతీ నందు రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలకు గడ్డి మందు కొట్టించడం జరిగింది. మురుగు కాలువలో మట్టి తీయడం జరిగింది. ముచ్చర్ల గ్రామ సెక్రెటరీ అనురాధ ఉపసర్పంచ్ ఆర్ ఉమా , సర్పంచ్ దగ్గర ఉండి మందు కొట్టించడం జరిగింది ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## స్థానిక సమస్యల పై పాలకవర్గం దృష్టి పెట్టాలి

- సీపీఎం వైరా డివిజన్ నేత కొండబోయిన ఉమావతి

**కారేపల్లి, ఆగస్టు 6, ప్రజా జ్యోతి:** సింగరేణి మండల కేంద్రమైన కారేపల్లి పంచాయతీ సమస్యలపై పాలక వర్గం ప్రత్యేక దృష్టి పెట్టాలని సీపీఎం వైరా డివిజన్ కమిటీ సభ్యురాలు కొండబోయిన ఉమావతి డిమాండ్ చేశారు. గురువారం కారేపల్లి శాఖ సమావేశం సీనియర్ నాయకులు తలారి దేవప్రకాష్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఉమావతి మాట్లాడుతూ కారేపల్లిలో డ్రైనేజీ, రోడ్లు, వీధిలైట్లు, విద్యుత్, మంచినీరు, పారిశుధ్యం సమస్యలు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. పంచాయతీ క పాలకవర్గం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు.సినిమా హాల్, పాత డీబీ సెంటర్, ఇమ్మడి బజార్ ప్రాంతాల్లో విద్యుత్ లైన్లు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయని తెలిపారు. తక్షణమే మరమ్మతులు చేపట్టి ప్రమాదాలు జరగకముందే జాగ్రత్తవహించాలన్నారు. స్థానికంగా విద్యుత్ లైన్ మ్యాన్ లేక పోవటంతో విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం కల్గుతుందన్నారు. కారేపల్లిలోని అన్ని వీధులకు సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని, సైడ్ డ్రైనేజీలను నిర్మించాలని కోరారు. బస్టాండ్ సెంటర్ లో నిర్మాణ పనులను పూర్తి చేసి నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. ప్రజల నివాస గృహాల మధ్య ఉన్న ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ ఉండటంతో దోమలు, అపరిశుభ్రత కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పంచాయతీలోనెలకొన్నసమస్యలను సత్వర పరిష్కారంకు స్థానిక సర్పంచ్, పాలకవర్గం, పంచాయతీ కార్యదర్శి చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఎం శాఖ కార్యదర్శి అన్నారపు కృష్ణ, నాయకులు ముండ్ల ఏకాంబరం, ఇల్లంగి పిచ్చయ్య, పాసిన్ని నాగేశ్వరరావు, షేక్ బందేలు, రాయమల్లు, ముక్కా సీతారాములు, మహమ్మద్, పాషా తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మార్పీఎస్ ఉద్యమ నేత కట్ట అంతిమయాత్రలో పాల్గొన్న పద్మశ్రీ మందకృష్ణ మాదిగ

- **మందకృష్ణ రాకతో దద్దరిల్లిన ప్రొద్దుటూరు...**



**చింతకాని 05 ఆగస్టుప్రజాజ్యోతి :** మండల పరిధి లోని ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ ఉద్యమ నేత ,ప్రముఖ ఆర్ఎంపి వైద్యులు కట్ట వెంకటేశ్వర్లు బుధవారం రాత్రి గుండె పోటుతో మృతి చెందారు కట్ట వెంకటేశ్వర్లు ఆర్ఎంపి వైద్యులుగా, ఎమ్మార్పీఎస్ ఎమ్మార్పీఎస్ ఉద్యమ నేత గా పేదలకు తన వైద్య సేవలను అందిస్తూ పేదల వైద్యుడిగా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారు వైద్యంతో పాటు వైద్యంతోపాటు అలాగే సామాజిక స్పృహతో ఎంఆర్పిఎస్ చేస్తున్న ఉద్యమాలకు ఆకర్షితుడై పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ అడుగుజాడల్లో మొదటి నుంచి నడుస్తూ ఎమ్మార్పీఎస్ 30 ఏళ్ల ఉద్యమానికి ఆర్థికంగా మండల కమిటీకి సహాయ సహకారాలు అందిస్తూ తన వంతు కృషి చేశారు తన వయసు రిత్యా అనారోగ్య పాలు కావడం, ఉద్యమానికి తన అకాల మరణం తీరని లోటు గా మిగిలింది కట్ట వెంకటేశ్వర్లు మరణ వార్త తెలుసుకున్న మందకృష్ణ మాదిగ హుటా హుటిన హైదరాబాదు నుంచి తన ముఖ్యమైన కార్యక్రమాలను సైతం రద్దు చేసుకొని కట్టా వెంకటేశ్వర్ల అంతిమయాత్రలో పాల్గొన్నారు స్వయంగా కట్ట వెంకటేశ్వర్ల అంతిమయాత్ర ముగింపు వరకు స్వయంగా పాడే మోసి, భూస్థాపితం ముగిసే వరకు అక్కడే ఉండి తన ప్రగాఢ సానుభూతిని అభిమానాన్ని చాటుకున్నారుఅలాగే కృష్ణ మాదిగ రాకతో ప్రొద్దుటూరు చుట్టుపక్కల గ్రామల ప్రజలు సైతం పాల్గొనడంతో ప్రొద్దుటూరు గ్రామం జనసంద్రంగా మారింది ఈ సందర్భంగా కృష్ణమాదిగ మాట్లాడుతూ ఇంతకాలం నా సహచరుడిగా ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి సహకరిస్తూ వచ్చిన కట్ట వెంకటేశ్వర్లు కుటుంబానికి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ ఇటువంటి సమయంలో వారి కుటుంబ సభ్యులకు ఎమ్మార్పీఎస్ అండగా ఉంటుందన్నారు అనంతరం ఇటీవలే ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన తుడుం స్వామి చని పోవడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి ఇద్దరు కుమారులకు మెరుగైనటువంటి విద్యను అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని శ్రేణులకు ఆదేశించారు ఈ కార్యక్రమంలో వార్తాపత్రిక సీనియర్ జర్నలిస్టు గార్లపాటి రమేష్ ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల జాతీయ రాష్ట్ర జిల్లా మండల గ్రామ స్థాయిలో గల నాయకులు, కుటుంబ సభ్యులు, సానుభూతిపరులు శ్రేయోభిలాషులు వివిధ గ్రామాలకు చెందిన గ్రామీణ వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన జర్నలిస్టులకు ఇండ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించాలి

- **మధిర ప్రెస్ క్లబ్ డిమాండ్**




**మధిర ప్రజా జ్యోతి** సమాజంలో నిత్యం ప్రజా సమస్యలపై గళం ఎత్తుతూ, ప్రభుత్వాల పనితీరును ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేస్తున్న జర్నలిస్టుల సంక్షేమంపై ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాలని మధిర ప్రెస్ క్లబ్ స్పష్టం చేసింది. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇల్లు మరియు ఇళ్ల స్థలాలను కేటాయించాలని డిమాండ్ చేస్తూ, ఈ డిమాండ్ల సాధన కోసం త్వరలోనే ఒక ప్రత్యేక కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు. గురువారం మధిర ప్రెస్ క్లబ్ కార్యాలయంలో గౌరవ అధ్యక్షులు నాళ్ళ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన సన్నాహక సమావేశంలో ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జీవీ, అరుణ్ మాట్లాడుతూ నిరంతరం ప్రజల కోసం శ్రమించే జర్నలిస్టులు అనేక కుటుంబ మరియు ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటున్నారని, వారి సంక్షేమం కోసం ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు. అర్హులైన ప్రతి జర్నలిస్టు కుటుంబానికి శాశ్వత ప్రాతిపదికన ఇల్లు లేదా ఇళ్ల స్థలాన్ని కేటాయించాలి. ,జర్నలిస్టులందరికీ మెరుగైన వైద్యం అందించేందుకు హెల్త్ కార్డులను తక్షణమే మంజూరు చెయ్యాలని, విధి నిర్వహణలో భాగంగా నిత్యం ప్రయాణాలు చేసే జర్నలిస్టులకు రైల్వే మరియు బస్సు పాసులను మంజూరు చేయాలని ఈ ఈ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను ప్రత్యేకంగా కోరారు. ఈ సమావేశంలో ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు లిక్కీ రవీందర్, వంగూరు గోపి, సహాయ కోశాధికారి యడవల్లి శ్రీధర్, ప్రచార కార్యదర్శి అర్జున్, సహాయ కార్యదర్శులు వాసు,సుధీర్ శంకరాచారి, మహంకాళి శ్రీనివాసరావు, చారుగుండ్ల నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జయశంకర్ జయంతి



**కల్లూరు ఆగస్టు 06 : ప్రజా జ్యోతి** కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ప్రజాప్రతినిధులు అధ్యాపకులు పూలమాల వేసిన నివాళులు అర్పించారు. అనంతరం కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఉచిత పుస్తకాలను పంపిణీ చేశారు ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రొఫెసర్ జయశంకర్ చేసిన సేవలు చిరస్మరణీయమని ఆయన ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్, కల్లూరు మున్సిపాలిటీ చైర్మన్ ధరావత్ మోహన్, నాయక్ వైస్ చైర్మన్ శీలం కోటేశ్వరి కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు దాసరి సుధారాణి యాస నాగమణి శ్రీకాంత్ కల్లూరు మండల పార్టీ అధ్యక్షుడు పోట్రు అర్జున్ రావు, కాంగ్రెస్ నాయకులు షేక్ బాజీ బొల్లం ఉపేందర్ కళాశాల ప్రిన్సిపల్ వేముల శేఖర్, అధ్యాపకులు శ్రీనివాసరావు, షకిలాబాను పుల్లారావు, వరలక్ష్మి, రంజిత్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## రికార్డులు పరిశీలించిన ఆడిటర్ చైతన్యకుమార్



**ఎరుపాలెం ప్రజా జ్యోతి** ప్రభుత్వ ఆదేశాల మేరకు సోషల్ ఆడిట్ కు సంబంధించిన రికార్డులు, రిజిస్టర్లు,ఆర్థిక లావాదేవీలను గురువారం స్టేట్ ఆడిటర్ చైతన్యకుమార్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రామన్న పాలెం లో రికార్డులు పరిశీలించి మధ్యాహ్నం భోజనం విద్యార్థులు చదువు క్రీడలు ఉపాధ్యాయుల సమయపాలన, ప్రభుత్వం అందించే పథకాలపై విద్యార్థులను పలు విషయాలు అడిగి తెలుసుకొని అన్ని విషయాలు విద్యార్థులతో మాట్లాడారు. తరగతి గదులు వసతులు, వాష్ రూమ్, తాగునీరు, ఫ్యాన్లు, విద్యార్థుల హాజరు శాతం అన్ని విషయాలను, క్షుణ్ణంగా పరిశీలించి పాఠశాల ప్రధానోపాధ్యాయుల వేల్పుల జయరాజు వద్ద నివేదిక తీసుకొని సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చైతన్య కుమార్ మాట్లాడుతూ ఈ నివేదికను రాష్ట్ర విద్యాశాఖకు పంపుతానని ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందించే విధంగా ఉండాలని అన్నారు. తల్లిదండ్రులు భాగస్వాములు కావాలని, ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన వసతులు, ప్రభుత్వం కల్పిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వేమిరెడ్డి పరమేశ్వరి ఉపాధ్యాయులు దొండపాటి రమేష్ చెడే శ్రీనివాస్ షేక్ షాజహాన్ జి భార్గవి యం డి అజీమ్ జి బాలకృష్ణ డి రాజశేఖర్ సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

## జీవనశైలిలో యోగా యొక్క ప్రాముఖ్యత గురించి అవగాహన





**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** గురువారం ఖమ్మం జిల్లా ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఖమ్మం హెడ్ క్వార్టర్ నందు బిఎస్సి నర్సింగ్ స్టూడెంట్స్ ( మహబూబాబాద్ ) లకు ఆయుర్వేదం యొక్క ప్రాముఖ్యతను, ఏ వ్యాధులకు ఎటువంటి చికిత్సలు చేయబడును, ఔషధ మొక్కల యొక్క ఉపయోగాలు గురించి వారికి అవగాహన కల్పించి అంతేకాకుండా మారుతున్న జీవన శైలిలో యోగా యొక్క ప్రాముఖ్యతను గురించి అవగాహన కల్పించడం జరిగింది . ఈ కార్యక్రమంలో డాక్టర్ వై . ఉపేందర్ సీనియర్ వైద్యాధికారి, ఇతర సిబ్బంది యోగ ఇన్స్ట్రక్టర్లు,నర్సింగ్ కాలేజీ అధికారులు ఎం .లీల,ప్రిన్సిపల్,శైలజ హెచ్ ఓ డి, టీచింగ్ ఫ్యాకల్టీ రాగ స్రవంతి,నలిని,రాజ్యలక్ష్మి,బీఎస్సీ నర్సింగ్ రెండవ సంవత్సరం,నాలుగవ సేమ్ స్టూడెంట్స్ 52 మంది పాల్గొన్నారు.

## సాతానిగూడెం కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడిగా సత్తి వీర బాబు ఏకగ్రీవ ఎన్నిక

**కామేపల్లి ప్రజా జ్యోతి ఆగస్టు 6** కామేపల్లి మండల పరిధిలోని సాధారణ గూడెం గ్రామం లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా గుజ్జర్లపూడి రాంబాబు మరియు గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు ఎన్నికల నిర్వహించారు ఈ సమావేశంలో సాతాను గూడెం కాంగ్రెస్ గ్రామ శాఖ నూతన అధ్యక్షుడిగా సత్తి వీరబాబును ఏకగ్రీవంగా ఎన్నికచేయడం జరిగింది ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ నూతన అధ్యక్షుడు పార్టీ బలోపేతానికి గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రజలకు చేరవేస్తూ స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు నాయకులకు కార్యకర్తలకు సత్తి వీరబాబు ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు



# తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు

- జిల్లా మత్స్య పారిశ్రామిక అధ్యక్షులు మామిడి వెంకటేశ్వర్లు



**ఖమ్మం ప్రతినిధి ( ప్రజా జ్యోతి ) ఆగస్టు 6:** 2026 – 27 సంవత్సరానికి మత్స్యకారులకు ప్రభుత్వం ఉచిత చేప పిల్లల కొరకు 116 కోట్లు బడ్జెట్ ను ప్రకటించిన సందర్భంగాజిల్లా మత్య పారిశ్రామిక సహకార సంఘం – ఖమ్మం జిల్లా అధ్యక్షులు మామిడి వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ రాష్ట్ర మత్స్య శాఖ అభివృద్ధి మంత్రి శ్రీ వాకటి శ్రీహరి ముదిరాజ్ కృషితో రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డికి , ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నిధులు కేటాయించినందుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ ఖమ్మం జిల్లా లోని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావుకు పొంగలేటి శ్రీనివాస్ రెడ్డి మరియు ఎంపీ ఎమ్మెల్యేలు , ఎమ్మెల్సీ లకు జిల్లా మత్స్య కారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ ఈ ప్రభుత్వానికి మత్స్యకారుల మద్దతు ఎల్లవేళలా ఉంటుందని తెలియజేశారు . ఈనెల 4వ తారీఖు మంగళవారం రోజున రాష్ట్రమత్స్యశాఖ మంత్రి శ్రీ వాకిటి శ్రీహరి 33 జిల్లాల అధ్యక్షులు తో హైదరాబాదు తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ మత్స్యకారుల అభివృద్ధి కొరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలను విడుదల చేస్తుందని తెలుపుతూ ఆగిపోయిన ఇన్సురెషన్ పాలసీని పొడిగిస్తున్నట్లు తెలిపారు . మరియు మత్స్యకారుల అభివృద్ధి కొరకు మోటార్ సైకిల్స్ , వలలు ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు . ఇతర రాష్ట్రాల కంటే తెలంగాణ రాష్ట్రాన్ని మత్స్య సంపదలో ముందించుతామని తెలిపారు . ఈ కార్యక్రమంలో జిల్లా మత్య పారిశ్రామిక సహకార సంఘం – ఖమ్మం డైరెక్టర్లు కన్నబోయిన శ్రీనివాసరావు , ఆత్మకూరు వీరబాబు , సర్పంచులు ఎస్కే కాసిం , మద్దుల నాగేశ్వరరావు , తురక వెంకన్న , చెన్నబోయిన వెంకటేశ్వర్లు , శీలం శ్రీను , బొమ్మన పోయిన వెంకయ్య , ముద్రబోయిన రాంబాబు , పిట్టల కొండయ్య , పిట్టల బుచ్చయ్య , పంగా వెంకన్న మరియు కార్యదర్శులు షేక్ నాగులు మీరా , తౌడ బోయిన కృష్ణ , బోయిన రామయ్య , దొండా దుర్గయ్య , పల్లెబోయిన వెంకట్రామయ్య , చింతల సంపత్ కుమార్ , ధరావత్ శ్రీను , పులి బుజ్జి సత్యనారాయణ , తోటపల్లి సాల్మన్ తదితరులు పాల్గొన్నారు .

# ఘనంగా శ్రీమంత వేడుకలు మరియు అన్నప్రాసన కార్యక్రమం



**మధిర ప్రజా జ్యోతి** మధిర ఐసీడీఎస్ (ఐ సి డి ఎస్) ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం వైభవంగా ప్రత్యేక వేడుకలను నిర్వహించారు. పీడీ ఏ. ప్రమీల మరియు సీడీపీఓ జి. కృష్ణశ్రీ ఆధ్వర్యంలో ఎలాంటి హంగు ఆర్భాటాలకు పోకుండా, సంప్రదాయబద్ధంగా గర్భిణులకు శ్రీమంత వేడుకలు మరియు చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలను ఘనంగా చేపట్టారు.ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత మరియు కమిషనర్ సామ్యూల్ పాల్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా వారు గర్భిణులకు సంప్రదాయబద్ధంగా ఓడీ పోసి, అక్షితలు వేసి ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో ఎస్సీడీపీఓ షకీరా, ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు, సూపర్వైజర్లు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# తల్లిపాలే శిశువుకు తొలి రక్షణ

**మండలంలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు**
**సీడీపీవో కవిత ఆధ్వర్యంలో విస్తృత అవగాహన కార్యక్రమాలు**
**సీడీపీవో కవిత చొరవతో విజయవంతంగా తల్లిపాల వారోత్సవాలు**
**తొలి ఆరు నెలలు తల్లిపాలే శిశువుకు సంపూర్ణ ఆహారం**
**మాతాశిశు ఆరోగ్యంపై విస్తృత అవగాహన**





**తిరుమలాయపాలెం, ప్రజాజ్యోతి:** తిరుమలాయపాలెం మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను సీడీపీవో కవిత ప్రత్యేక చొరవతో ఘనంగా నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ గ్రామాల వారీగా కార్యక్రమాలు నిర్వహిస్తూ గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యత, పోషకాహారం, మాతాశిశు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నారు. కార్యక్రమాల నిర్వహణను సీడీపీవో కవిత స్వయంగా పర్యవేక్షిస్తూ అవసరమైన సూచనలు చేస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం సుబ్లేడ్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలు–1, 2లో నిర్వహించిన తల్లిపాల వారోత్సవానికి గ్రామ సర్పంచ్ సంగబత్తులస్వాతి సుమన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా సీడీపీవో కవిత మాట్లాడుతూ..పుట్టిన గంటలోపే శిశువుకు తల్లిపాలు పట్టించడం అత్యంత కీలకం. తొలి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే ఇవ్వడం వల్ల చిన్నారులు ఆరోగ్యంగా, చురుకుగా ఎదుగుతారన్నారు. తల్లిపాలు శిశువుకు సహజ రోగనిరోధక శక్తిని అందించే అమూల్యమైన వరం అని అన్నారు. ప్రతి గర్భిణి ప్రభుత్వ ఆరోగ్య సేవలను వినియోగించుకుని ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవం చేయించుకోవాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ సూపర్వైజర్ లక్షి మాట్లాడుతూ..గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న అన్ని సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.సర్పంచ్ సంగపతుల స్వాతి సుమన్ రెడ్డి మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి గ్రామపంచాయతీ తరఫున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.అనంతరం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సెక్టర్ సూపర్వైజర్ లక్షి ,ఏఎన్ఎంలు సుభద్ర, ఉపేంద్ర, ఆశా వర్కర్లు నాగేందేంద్ర సత్యవతి, లత, స్వాతి, మరియుపుష్పవతి, గాయత్రి, పద్మ, లలిత, అంగన్‌వాడీ సిబ్బంది, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

# మత్కేపల్లి ఎక్స్ రోడ్డు వద్ద ఖమ్మం-విజయవాడ ఎక్స్‌ప్రెస్ బస్సు అధికారిక నిలుపుదల







**చింతకాని ఆగస్టు 06ప్రజాజ్యోతి :** చింతకాని మరియు ముదిగొండ మండలాల ప్రజల సౌకర్యార్థం, మండల ప్రజల విజ్ఞప్తి మేరకు ఖమ్మం–విజయవాడ ఎక్స్‌ప్రెస్ బస్సుకు మత్కేపల్లి ఎక్స్ రోడ్డు వద్ద అధికారికంగా స్టాప్ మంజూరు చేయడం జరిగింది.ఇకపై ఖమ్మం నుండి ప్రతిరోజు ఉదయం 5:00 గంటలకు విజయవాడకు బయలుదేరే ఎక్స్‌ప్రెస్ బస్సును మత్కేపల్లి ఎక్స్ రోడ్డు వద్ద 5:30 గంటలకు చింతకాని, ముదిగొండ మండలాల ప్రజలు ఎక్కి తమ ప్రయాణాన్ని సౌకర్యవంతంగా కొనసాగించవచ్చు.ఈ సౌకర్యం వల్ల రెండు మండలాల ప్రజలకు విజయవాడ ప్రయాణం మరింత సులభతరం కానుంది.ఈ అవకాశాన్ని కల్పించిన ఖమ్మం డిపో మేనేజర్ గారికి చింతకాని,ముదిగొండ మండలాల ప్రజల తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము.ప్రజలందరూ ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని మనవి.

# రహదారులపై బైక్ స్టంట్లు చెస్తున్న యువకులను బైండోవర్ చేసిన పోలీసులు

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** రోడ్లపై అత్యుత్సాహం ప్రదర్శిస్తూ మమత రోడ్డు లో బహిరంగ రహదారులపై ప్రాణాపాయం కలిగించే విధంగా బైక్ స్టంట్లు చేస్తూ మితిమీరిన వేగంతో వాహనాలు నడుపుతూ ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్న ఖమ్మం నగరానికి చెందిన శివ శంకర్ సింగ్ 18 సం,, అదేవిదంగా బర్తడే పేరుతో రోడ్డుపై తల్వర్ తో విన్యాసాలు చేస్తూ.. కేక్ కట్ చేసిన సన్నీ దయాల్ సింగ్ 33సం,,లపై కేసులు నమోదు చేసి, తాసిల్దార్ ఎదుట హాజరు పరిచి బైండోవర్ చేసినట్లు ఖమ్మం ఖానాపురం హవెలి ఇన్స్పెక్టర్ భానుప్రకాష్ తెలిపారు.బహిరంగ రోడ్లపై బైక్ విన్యాసాలు చేయడం చట్టరీత్యా నేరమని, విన్యాసాలు స్టంట్లు చేసే యువకుల ప్రాణాల మీదికి తేవడమే కాకుండా, రోడ్డుపై వెళ్లే పాదచారులకు, ఇతర వాహనదారులకు తీవ్ర ప్రమాదకరంగా మారుతున్నరాని అన్నారు. ప్రదానంగా తల్లిదండ్రులు తమ మైనర్ పిల్లలకు బైక్‌లు ఇవ్వకూడదని,అదేవిధంగా పిల్లల రోజువారి కార్యకలాపాలను నిశితంగా గమనిస్తూ ఉండాలని,చట్టవరుద్ధమైన ప్రాణాపాయం కలిగించే ఇలాంటి పనులకు దూరం ఉండేలా కౌన్సిలింగ్ ఇవ్వాలని అన్నారు. అలాగే యువత ఇలాంటి సాహసాలకు పోయి ప్రాణాలను పోగొట్టుకోవద్దని సూచించారు.ప్రజల భద్రతకు భంగం కలిగించేలా ఎవరైనా వ్యవహరిస్తే, స్థానిక పోలీసులకు లేదా డయల్ 112 కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు

# జైలు భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

- సిఐటియు మండల కన్వీనర్ బాదావత్ శ్రీను పిలుపు

**కామేపల్లి ప్రజా జ్యోతి ఆగస్టు 6** ఈనెల 10న నిర్వహిస్తున్న జైలు భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిఐటియు కామేపల్లి మండల కన్వీనర్ బాదావత్ శ్రీను పిలుపునిచ్చారు కామేపల్లి మండలం ముచ్చర్ల గ్రామంలో శనివారం బి కోటయ్య అధ్యక్షతన నిర్వహించిన బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సమావేశంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు లక్ష్మ చారి సిఐటియు మండల కన్వీనర్ బాదావత్ శ్రీను మాట్లాడుతూ కార్మికులు కర్షకుల పొట్ట కొట్టే విధానాలను బిజెపి ప్రభుత్వం అవలంబిస్తుందని లేబర్ కోడ్ ల పేరుతో చట్టాలను రద్దుచేసి వారిని నట్టేట ముంచే నాలుగు చట్టాలను తీసుకువచ్చి నాన్న ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు గతంలో రైతులు ఢిల్లీ నడిబొడ్డున సంవత్సరాల పాటు ధర్నాలు రాస్తారోలు చేసి విజయం సాధించిన సంగతి ఈ ప్రభుత్వాలు గుర్తు చేసుకోవాలని అన్నారు తీసుకొచ్చి వ్యవసాయ కార్మికులు కూలీలను పొట్ట కొట్టే విధానాన్ని తీసుకొచ్చారని అన్నారు బిల్డింగ్ వర్కర్లకు హెల్త్ కార్డులు ఇవ్వాలని పని చూపించాలని రక్షణ చట్టాలు చేయాలని అన్నారు ఈ కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి భూక్య రమణ వీరభద్రం ఎస్కే పాషా ఫరీద్ గోపి జాను శ్రీను హనుమంతు అక్బర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మధిరలో ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు



**మధిర ప్రజా జ్యోతి** స్థానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మధిర లో ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. రవీంద్రారెడ్డి అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రొఫెసర్ జయశంకర్ చేసిన విశిష్ట సేవలు, త్యాగాలు, ఉద్యమ స్ఫూర్తిని విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని సమాజాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. అనంతరం ఆయన ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో దోస్త్ కోఆర్డినేటర్ డా. ఎస్. ఇందిర, ఎన్ఎస్ఎస్ కార్యక్రమ అధికారి డా. పి. సుజాత, డా. వి. నాగరాజు, డా. ఎం.వి.ఎన్. శర్మ, సగ్గుర్తి జ్యోతి, ఎం. హారిక, పి. లక్ష్మీనారాయణ, పి. శ్రీనివాస్, టీ. ఆదర్శ్, ఎస్. పృథ్వీరాజ్ తదితర అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.